క్లుప్తంగా

లో ఓల్టేజ్ సమస్యకు చెక్



ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభిస్తున్న సర్పంచ్

మామిడికుదురు: పాశర్లపూడిలంక పితానివారి మెరకలో నూతనంగా ఏర్పాటు చేసిన 16 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు ఆదివారం ప్రారంభించారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో ఎప్పటి నుంచో స్థానికులు ఎదుర్కొంటున్న లో ఓల్టేజ్ సమస్య పరిష్కారమవుతుందన్నారు. విద్యుత్ సమస్యలకు ఈ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో మోక్షం కలుగుతుందని సర్పంచ్ చెప్పారు. కార్యక్రమంలో ఏఈ వెంకటేశ్వరరావు, పెద్దలు పితాని వెంకటేశ్వరరావు, కోలా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌కు నేడు అంతరాయం

కొత్తపేట: ముక్కామల ఎస్ఎస్, 11కేవీ మోడేకుర్రు ఫీడర్ వద్ద ఆర్‌డీడీఎస్ పనుల నిమిత్తం మోడేకుర్రు, గొల్లకోటివారిపాలెం, పితానివారి పాలెం, రాకుర్తివారిపాలెం, చిరతపూడి గ్రామాలకు సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అమలాపురం ఈఈ రాంబాబు తెలిపారు.

రేపు మెగా జాబ్ మేళా

మామిడికుదురు: రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం మామిడికుదురు దీప్తి డిగ్రీ కళాశాల ప్రాంగణంలో మెగా జాబ్ మేళా జరుగుతుందని దీప్తి విద్యాసంస్థల కరస్పాండెంట్ డీవీవీ సత్యనారాయణ ఆదివారం తెలిపారు. ఉదయం 10 గంటలకు ఈ జాబ్ మేళా ప్రారంభమవుతుందన్నారు. ఈ జాబ్ మేళాలో 15 కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరవుతారని, వెయ్యి మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, పీజీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని చెప్పారు. ఔత్సాహికులు తమ బయోడేటాతో హాజరై ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. డీఎస్‌డీఓ హరిశేషు ఆధ్వర్యంలో ఈ జాబ్ మేళా జరుగుతుందన్నారు.

ఆర్థిక సాయం

మలికిపురం: మండలంలోని విశ్వేశ్వరాయపురానికి చెందిన నేదునూరి వెంకటేష్ కొంత కాలం క్రితం ప్రమాదశాస్తు భవనం పైనుంచి పడిపోయాడు. వెన్నెముక పూర్తిగా దెబ్బతినడంతో గల్ఫ్ శెట్టిబలిజ యువశక్తి సేవాసంస్థ ఆర్థిక సాయం సమకూర్చింది. సంస్థ సభ్యులు గుబ్బల శ్రీనివాస్ ఆధ్వర్యంలో రూ.39 వేలు వైద్యం నిమిత్తం అందించారు. మలికిపురం ఎస్సై సురేష్, మాజీ ఎన్ఆర్ఈడీసీ డైరెక్టర్ పాటి శివకుమార్, రాష్ట్ర బీసీ నాయకులు గుబ్బల బాబ్జి తదితరులు అందజేశారు. కార్యక్రమంలో గ్రూపు అకౌంటెంట్ గుబ్బల శ్రీనివాస్, సంస్థ సభ్యులు దొంగ మహేష్, ఎంపీటీసీ గుబ్బల సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వెంకట్‌కు అవార్డు ప్రదానం



వెంకట్‌ను సత్కరిస్తున్న కళావేదిక సంస్థ ప్రతినిధులు

అంబాజీపేట: సామాజిక అంశాలతో తనదైన శైలితో కవిత్వం ద్వారా సమాజానికి మంచి సందేశాలను అందిస్తున్న వెంకట్ పాలమూరికి తెలుగు తేజం అవార్డును ప్రదానం చేశారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలోని భువనచంద్ర టౌన్ హాలులో శ్రీశ్రీకళావేదిక ఆధ్వర్యంలో జరిగిన తెలుగు భాషా దినోత్సవ సంబరాల్లో భాగంగా అంబాజీపేటకు చెందిన ప్రముఖ సామాజిక సహజకవి, కవిరత్న వెంకట్ పాలమూరికి తెలుగు తేజం అవార్డును ప్రదానం చేసి సత్కరించారు. కళావేదిక సంస్థ సీఈఓ కత్తిమండ ప్రతాప్ చేతుల మీదుగా అవార్డును వెంకట్ అందుకున్నారు.

నల్లా సేవలు చిరస్మరణీయం

పి.గన్నవరం: కాపు రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత నల్లా సూర్యచంద్రరావు వర్ధంతిని పి.గన్నవరం అక్విడెక్టు పార్కులో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కాపు సంక్షేమ సంఘ నాయకుడు నల్లా పెదకాపు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, కాపు సంక్షేమ సంఘ అధ్యక్షుడు అడ్డగళ్ల వెంకట సాయిరామ్, రాష్ట్ర మాలల జేఏసీ కో-కన్వీనర్ కోట రామ్మోహన్ రావు నల్లా సేవలను కొనియాడారు. నాయకులు గిడ్డి ఆనంద్, అడబాల తాతాకాపు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన

మామిడికుదురు: అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాల బీఈడీ స్టూడెంట్స్, ఆక్సిజన్ అసోసియేషన్ సంయుక్తంగా పాశర్లపూడిలో ఆదివారం ఫీల్డ్ వర్క్ నిర్వహించారు. దీనిలో భాగంగా ఇంటింటికీ వెళ్లి పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. స్వచ్ఛభారత్‌తో పాటు తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పించారు. స్థానికులకు ఉచితంగా చెత్త బుట్టలు పంపిణీ చేశారు. సర్పంచ్ ప్రేమజ్యోతి, ఎస్‌కేబీఆర్ కళాశాల బీఈడీ ప్రిన్సిపాల్ అంజనీ శ్రీనివాస్, ఆక్సిజన్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కటికిరెడ్డి గంగాధరం, నాగరాజు పాల్గొన్నారు.

నిమజ్జనం.. చేద్దామిలా!

- ప్రమాదాలకు తావు లేకుండా నిమజ్జనోత్సవాలు
- ఉత్సవ కమిటీలు, యువతకు పోలీసుల సూచనలు
- సుమారు 1,100 గణపతి నవరాత్ర పందిర్లు



గణపతి నిమజ్జనోత్సవ ఊరేగింపు (ఫైల్)

కొత్తపేట: వాడవాడలా గణపతి నవరాత్ర మహోత్సవాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఉత్సవాలు అనంతరం గణపతి ఆలయాలు, నవరాత్ర పందిర్లలో నెలకొల్పిన గణపతి విగ్రహాలను సమీప కాలువలు, గోదావరి నదుల్లో నిమజ్జనం చేయడం ఆనవాయితీ. ఆ నిమజ్జన సమయంలో ఏ విధమైన అపస్మృతులకు తావు లేకుండా నిమజ్జనం సుఖాంతం కావాలి. దానికనుగుణంగా ఉత్సవ కమిటీలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు, రెవెన్యూ శాఖలు హెచ్చరిస్తున్నాయి.

కమిటీ సభ్యులదే బాధ్యత

సాధారణంగా అత్యధిక ఉత్సవ పందిర్లలో గణపతులను 9 రోజులు, 11 రోజుల అనంతరం నిమజ్జనం చేస్తారు. పలుచోట్ల ముందుగానే 3వ రోజు, 5వ రోజు, 7వ రోజు కూడా నిమజ్జనం చేస్తారు. ఆగస్టు 27న వినాయక చవితి సందర్భంగా కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల పరిధిలోని 11 మండలాల్లో సుమారు 1,100 గణపతి ఉత్సవ పందిర్లలో వినాయకుని విగ్రహాలు నెలకొల్పారు. ఆయా ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ప్రతిరోజు ఉదయం, రాత్రి పూజాదికాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఎక్కడికక్కడ వినాయక ఉత్సవ పందిర్లలో గణపతియే నమః నామస్మరణ మార్మోగుతోంది. భక్తిశ్రద్ధలతో నిర్వహించే నవరాత్ర ఉత్సవాలు నిమజ్జనాలతో ముగుస్తాయి. ఈ నెల 4వ తేదీతో నవరాత్రులు ముగుస్తాయి. ఆ రోజు నుంచి నిమజ్జనాలు ప్రారంభమవుతాయి. ఎంతో ఘనంగా జరిగే ఈ వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండాలంటే ఉత్సవాల నిర్వాహకులు, భక్తులు కొన్ని నియమాలు, జాగ్రత్తలు పాటించాలి. నిమజ్జన సమయంలో వాహనాన్ని అందంగా తీర్చిదిద్దడం, విద్యుత్తును వినియోగించడం, ఊరేగింపులో యువకులు ఉత్సాహంగా పాల్గొనడం సాధారణం. యువత అత్యుత్సాహం మాటున ప్రమాదాలు పొంచి ఉంటాయి. ఏమరుపాటుగా ఉన్న వారు ప్రమాదాల్లో చిక్కుకునే అవకాశం ఉంటుంది. అందువల్ల నిమజ్జన సమయంలో తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలి. ఏ ప్రమాదం జరిగినా కమిటీ సభ్యులే బాధ్యత వహించాలని ప్రభుత్వ శాఖల అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు.



వానపల్లిలో కాలువ రేవును పరిశీలిస్తున్న ఆర్డీవో, తహసీల్దార్

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

కొత్తపేట ఆర్డీవో శ్రీకర్ శనివారం కొత్తపేట మండలంలోని వానపల్లిలో బొబ్బర్లంక- ముక్తేశ్వరం కాలువ రేవులను పరిశీలించి, మండల, గ్రామ స్థాయి అధికారులకు పలు సూచనలు చేశారు. రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్, తహసీల్దార్ రాంబాబు కొత్తపేట మండలంలోని ఉత్సవ కమిటీలతో సమావేశం నిర్వహించి నిమజ్జనోత్సవం సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించారు.



కొత్తపేటలో ఉత్సవ కమిటీలకు సూచనలు చేస్తున్న సీఐ విద్యాసాగర్

- ఈత రానివారు నిమజ్జనం వేళ కాలువలు, గోదావరిలో దిగరాదు.
- ఉత్సాహంతో వాహనాలు ఎక్కుతూ, దిగుతూ ఉండే వారిని నియంత్రించాలి.
- వాహనాలకు మితిమీరిన విద్యుత్ అలంకరణలు మంచిది కాదు.
- నిమజ్జనానికి వెళ్లే దారిలో విద్యుత్ తీగలు తగలకుండా చూసుకోవాలి.
- వాహనాల డెకరేషన్‌కు తగిలే విద్యుత్ తీగలను తప్పించేందుకు పొడవైన ఎండు కర్రలు కూడా ఉండాలి.
- ఇతరులపై రంగులు చల్లడం, అసభ్యంగా ప్రవర్తిస్తే వివాదాలు తలెత్తుతాయి. అలాంటి వారితో కమిటీ అప్రమత్తంగా ఉండాలి.
- ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఊరేగింపు నిర్వహించాలి.

గతంలో జరిగిన అపశ్రుతులు

గతంలో గణపతి నవరాత్రులు ముగింపు సందర్భంగా గణేష్ నిమజ్జనాల్లో కొన్ని చోట్ల అపశ్రుతులు చోటుచేసుకున్నాయి. వాటిలో 2023 సెప్టెంబర్ 27న ఆలమూరు మండలం మడికిలో గణపతి నిమజ్జనంలో పాల్గొన్న అత్తిలి రాజేష్ (22) కాలువలో గల్లంతై మృతి చెందాడు. 28న బిక్కవోలు మండలం తొస్సిపూడిలో తేతలి ఎస్‌వీవీ రామారెడ్డి (20) కాలువలో గల్లంతయ్యాడు. ఇలా ఉమ్మడి జిల్లాలో ప్రమాదాలు జరిగాయి. ఇటువంటి ప్రమాదాలను దృష్టిలో పెట్టుకొని నిమజ్జనం వేళ మరిన్ని జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది.

- ఇరుకైన రహదారుల కంటే ప్రధాన రోడ్లపైనే ఊరేగింపు నిర్వహించాలి.
- రాత్రి సమయాల్లో కంటే పగటి పూట నిమజ్జనం నిర్వహిస్తే మంచిది. రాత్రి చేస్తే వెలుగు ఎక్కువ ఉండేలా చూసుకోవాలి.
- ఊరేగింపునకు ఎంతమంది వచ్చారు. తిరుగు ప్రయాణంలో వచ్చిన వారు ఉన్నారా? లేదా? అన్నది సరి చూసుకోవాలి.
- నిమజ్జనానికి ముందు పోలీసులకు సమాచారమిస్తే అవాంఛనీయ సంఘటనలు నియంత్రించే వీలుంటుంది.

కమిటీలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి



గణపతి నిమజ్జనోత్సవాల్లో ఏ విధమైన అపసృతులు చోటుచేసుకోకుండా, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ఉత్సవ కమిటీలు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. మద్యం సేవించకుండా, ట్రాఫిక్ అంతరాయం కలగకుండా, ఎవరికీ ఇబ్బంది లేకుండా ఊరేగింపు జరుపుకోవాలి. ఆ మేరకు ఇప్పటికే ఉత్సవ కమిటీలకు అవసరమైన సూచనలు ఇచ్చాం. నిమజ్జనాలు చేసే సమయంలో పోలీసులకు ముందస్తు సమాచారం ఇస్తే అందుకు తగిన చర్యలు చేపట్టడానికి అవకాశముంటుంది. నిమజ్జనాలు శాంతియుత వాతావరణంలో చేపట్టేలా పర్యవేక్షించాలని పోలీస్ స్టేషన్లకు ఆదేశాలిచ్చాం. రెవెన్యూ, విద్యుత్, మత్స్యశాఖలను సమన్వయ పరిచాం.

–సుంకర మురళీమోహన్, డీఎస్పీ, కొత్తపేట.

లంకల్లో జలజడి



అప్పనపల్లిలో గరుత్మంతుని విగ్రహం వద్ద వరద ఉధృతి



ఎదురుబిడెం కాజ్‌వే వద్ద పడవలపై దాటుతున్న లంక ప్రజలు

- పొంగి ప్రవహిస్తోన్న నదీపాయలు
- కాజ్‌వేపై పడవ ప్రయాణాలు
- రాకపోకలకు ఇబ్బందులు

పి.గన్నవరం: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో జిల్లాలోని వశిష్ట, వైనతేయి, గౌతమీ నదీపాయలు పొంగి ప్రవహిస్తున్నాయి. నెల రోజుల వ్యవధిలో మూడోసారి వరదలు రావడంతో లంక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నిత్యావసరాలు, తాగునీరు కోసం పడవలు దాటి లంక ప్రజలు బయటకు వస్తున్నారు. వరదలతో లంక గ్రామాల ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాకు సరిహద్దులో ఉన్న పెదమల్లంక, అనగర్లంక, సిర్రావారిలంక, అయోధ్యలంక గ్రామాల ప్రజలు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. చాకలిపాలెం శివారు కనకాయలంక కాజ్‌వే మునిగిపోవడంతో అక్కడ పడవలు ఏర్పాటు చేశారు. లంకల నుంచి ఏటి గట్లపైకి తరలించిన పశువులకు మేత లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఎల్.గన్నవరం, శివాయలంక, కనకాయలంక గ్రామాల్లో ప్రత్యేక అధికారి జయచంద్ర గాంధీ పర్యటించి స్థానిక అధికారులకు పలు సూచనలిచ్చారు.

అయినవిల్లి: మండలంలోని ముక్తేశ్వరం- అయినవిల్లి లంక మధ్య ఎదురుబిడెం కాజ్‌వేపై వరద నీరు ఉధృతిగా ప్రవహించడంతో పూర్తిగా మునిగింది. ఆదివారం లంక ప్రజలు రాకపోకల కోసం పడవలను అధికారులు ఏర్పాటు చేశారు. రెవెన్యూ అధికారులు వరద ప్రభావిత ప్రాంతాలైన అయినవిల్లిలంక, వీరవల్లిపాలెం, అద్దంకివారిలంక గ్రామాలకు చెందిన ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. కాజ్‌వే వద్ద రెవెన్యూ, పోలీసు, ఫైర్ సిబ్బంది ఎప్పటికప్పుడు సహాయ చర్యలను పర్యవేక్షిస్తున్నారు. వీరవల్లిపాలెం, అయినవిల్లిలంక, పొట్టిలంక, కొండుకుదురు లంక గ్రామాల్లోని పల్లపు ప్రాంతాల్లో అరటి, మొక్కజొన్న, తమలపాకు, కోకో, కూరగాయ పంటలు నీటమునిగాయి. ప్రభుత్వం తమను ఆదుకోవాలని లంక ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

అధికారుల చర్యలు

కనకాయలంక కాజ్‌వే వద్ద వరద పరిస్థితిని తహసీల్దార్ విద్యాపతి, ఎస్సై హరికోటిశాస్త్రి సమీక్షించారు.

మునిగిన ఇళ్లు, కొబ్బరి తోటలు

అంబాజీపేట: ఎగువ ప్రాంతాల్లో వరద పోటెత్తడంతో వైనతేయి గోదావరి శనివారం ఉధృతంగా ప్రవహించి గ్రామాల్లో ఉండే కౌశికలు ఉరకలు వేస్తున్నాయి. నందంపూడి, వాకలగరువు, తొండవరం గ్రామాల్లో ఇళ్లు, కొబ్బరి, అరటి, దొండ పాదులు నీట మునిగాయి. గోదావరి సమీపంలో ఉన్న కౌశికలోకి వరద నీరు చేరడంతో కాలనీలు, అరటి, కొబ్బరితోటలను ముంచెత్తుతున్నాయి. నందంపూడి బొంతువారి పేటలో ఆరు ఇళ్లు నీట మునిగాయి. తొండవరం రజకపేటకు వెళ్లే ప్రధాన రహదారి నీట మునగడంతో స్థానికుల రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

కాజ్‌వే వద్ద ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టారు. రెండు పడవలను ఏర్పాటు చేసి లంక గ్రామస్తుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. ఆర్ఐ రాయుడు, వీఆర్వోలు వారి వెంట ఉన్నారు.



అయినవిల్లిలంకలో కాజ్‌వే వద్ద పరిస్థితిని సమీక్షిస్తున్న తహసీల్దార్

ట్రాక్టర్లు ఏర్పాటు చేయాలి

పి.గన్నవరం మండలంలోని మానేపల్లి శివారు శివాయలంకకు వెళ్లే రహదారి రెండు కిలోమీటర్ల మేర వరదనీటతో మునిగిపోయింది. దీంతో ఆ గ్రామ ప్రజలు బయటకు వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నారు. మానేపల్లి ఏటిగట్టు నుంచి గతంలో మాదిరిగా ట్రాక్టర్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కాజ్‌వేను ముంచెత్తిన వరద

మామిడికుదురు: గోదావరి వరద అంతకంతకు ప్రమాదకరంగా మారుతోంది. ఈ నెలలో రెండో సారి అప్పనపల్లి కాజ్‌వే ముంపు బారిన పడింది. ఆదివారం దీనిపై మూడు అడుగుల మేర వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక గ్రామాల ప్రజలు వరద నీటిలో అష్టకష్టాలు పడుతూ రాకపోకలు సాగిస్తున్నారు. ఇక్కడ వరద మరింత పెరిగిన పక్షంలో రాకపోకలను నిలిపివేసేందుకు అధికారులు సన్నద్ధమయ్యారు. అప్పనపల్లి స్నానఘట్టం వద్ద అమృత లింగేశ్వరస్వామి విగ్రహం పూర్తిగా నీటి మునిగింది. గరుత్మంతుని విగ్రహం వద్ద గోదావరి వరద పరవళ్లు తొక్కుతోంది. వరద ఉధృతితో పెదపట్నం, పెదపట్నంలంక గ్రామాల్లోని పసుగ్రాసం, కూరగాయల తోటలు ముంపు బారిన పడ్డాయి. వరద మరింత పెరుగుతుందన్న జలవనరుల శాఖ హెచ్చరికలు తీర గ్రామాల ప్రజల్ని తీవ్రంగా కలవరపెడుతున్నాయి. అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.

జాగ్రత్తలు పాటించాలి

అంబాజీపేట: గణపతి నవరాత్రులను పురస్కరించుకుని గణేష్ మండపాల వద్ద భద్రత, నిమజ్జన సమయంలో తగు జాగ్రత్తలు పాటించాలని పి.గన్నవరం సీఐ భీమరాజు తెలిపారు. జిల్లా ఎస్పీ కృష్ణారావు ఆదేశాల మేరకు కొత్తపేట డీఎస్పీ మురళీమోహన్ పర్యవేక్షణలో నిమజ్జన సమయంలో పాటించాల్సిన నిబంధనలపై పలు సూచనలు చేశారని ఆయన తెలిపారు. వరదల కారణంగా చెరువులు, గోదావరి నది ప్రవహాలు ఎక్కువగా ఉన్నందున నిమజ్జన సమయంలో భక్తులు జారి పడే ప్రమాదం ఉన్నందున తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. నిమజ్జన ప్రదేశాలకు చిన్న పిల్లలు, మహిళలను తీసుకు రాకుండా చూసుకోవాలన్నారు. ఉత్సవ కమిటీ ముందుగా తీసుకున్న అనుమతుల ప్రకారం, చెప్పిన ప్రదేశాల్లో మాత్రమే నిమజ్జనం చేయాలన్నారు. పోలీస్ వారికి సమాచారం ఇవ్వకుండా ఊరేగింపు చేయకూడదన్నారు. మద్యం, ఏ విధమైన మత్తు పానీయాలు సేవించి ఊరేగింపులో పాల్గొంటే వారిపై చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమిస్తే పోలీసులు తీసుకునే చర్యలకు కమిటీ సభ్యులు బాధ్యులు అవుతారన్నారు.

వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలపై సమీక్ష



సమావేశంలో పాల్గొన్న గొల్లపల్లి సూర్యారావు

మలికిపురం: మండలంలో మంగళవారం నిర్వహించాల్సిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమాల నిర్వహణపై మలికిపురం పార్టీ కార్యాలయం వద్ద మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సూర్యారావు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజలకు రాజశేఖరరెడ్డి ఎనలేని సేవలు అందించారన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రుద్రరాజు చిన్నరాజా, మండపేట, జగ్గంపేట పరిశీలకులు కటకంశెట్టి ఆదిత్య కుమార్, పాటి శివ కుమార్, కుసుమ చంద్రశేఖర్, ఈద రవిరెడ్డి, మోకా సురేష్, కూపనరెడ్డి రాంబాబు పాల్గొన్నారు.

గణపతికి పెన్నుల పూజ

అంబాజీపేట: గణపతి నవరాత్రులను పురస్కరించుకుని స్థానిక గంగలకుర్రు మలుపులో ఉన్న శ్రీ విజయగణపతి ఆలయం వద్ద లక్ష్మీ గణపతి వినాయక సంఘం ఆధ్వర్యంలో వినాయకుడికి పెన్నుల పూజను ఆదివారం నిర్వహించారు. ఆలయ అర్చకుల పర్యవేక్షణలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని గణపతికి పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణం వద్ద ప్రసాద వితరణ, పెన్నులను పంపిణీ చేశారు.

ఘనంగా లక్ష గరిక పూజ

రాజోలు: గణపతి నవరాత్రులు పురస్కరించుకుని స్థానిక గాయత్రి యూత్ ఆధ్వర్యంలో ఆదివారం లక్ష గరిక పూజ నిర్వహించారు. స్వర్గీయ సత్తిరాజు గోపాలకృష్ణ మూర్తి కుటుంబ సభ్యులు కర్తలుగా గరిక పూజ చేశారు. వేద పండితులు పార్వతి దీక్షితులు, ఈవని ఫణికుమార్ ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సరస్వతీ పూజ నిర్వహించి వెయ్యి మంది విద్యార్థులకు పెన్నులు పంపిణీ చేశారు. డాక్టర్ సూర్యనారాయణమూర్తి, సత్తిరాజు స్వామి, న్యాయవాదులు సత్తిరాజు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వినాయకునికి లక్ష బత్తాయిలతో పూజ

మామిడికుదురు: గణపతి నవరాత్రుల్లో భాగంగా మామిడికుదురు మెయిన్‌రోడ్డులో శ్రీలక్ష్మీ గణపతి ఆటో వెల్‌ఫేర్ అసోసియేషన్, వర్తకులు, గ్రామ పురజనులు ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద ఆదివారం లక్ష బత్తాయిల పూజ ఘనంగా నిర్వహించారు. యదాశక్తి గరిక పూజతో పాటు యదాశక్తి లక్ష బత్తాయిల పూజ వైభవంగా జరిగింది.

సామూహిక సరస్వతీ పూజ

మామిడికుదురు: మండలంలోని మగటపల్లిలో శ్రీవరసిద్ధి వినాయక స్వామి గణపతి నవరాత్రుల సందర్భంగా ఆదివారం చిన్నారులతో వినాయకునికి ప్రత్యేక పూజలు చేయించారు. సామూహిక సరస్వతీ పూజలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. బ్రహ్మశ్రీ గోవిద వర్ఘుల మణీంద్రశర్మ ఆధ్వర్యంలో ఈ పూజలు ఏర్పాటు చేశారు.

కష్టపడి పని చేసిన వారికి గుర్తింపు

మామిడికుదురు: విధి నిర్వహణలో కష్టపడి పని చేసే వారికి ప్రజల్లో తగిన గుర్తింపు ఉంటుందని ఎంఈఓ మోకా వెంకన్నబాబు అన్నారు. నగరం ప్రధాన ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీ టీచర్‌గా పని చేసి పదవీ విరమణ పొందిన మందపాటి సరోజను ఆదివారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బావిశెట్టి నాగేశ్వరరావు, జాలెం సుబ్బారావు, రిటైర్డ్ ఎంఈఓ నీతిపూడి చంద్రరావు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్యం

అయినవిల్లి: మండలంలో ప్రసిద్ధి చెందిన విఘ్నేశ్వర స్వామి ఆలయం వద్ద అధికారులు కూచిపూడి నృత్యం ఏర్పాటు చేశారు. రాజమండ్రికి చెందిన కూచిపూడి, శ్రీలక్ష్మీ శ్రీనివాస నృత్యాలయం బృందం చేసిన నృత్యం స్థానికులను అలరించింది.

నిత్యాన్నదానానికి విరాళం

ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి మండలంలోని వెలువలపల్లికి చెందిన నవీన్ కుమార్ రూ.10,116లు విరాళం ఇచ్చారు. దాతను సత్కరించి స్వామి చిత్రపటం అందజేశారు.

రైతుల ఆరాధ్య దైవం బలరాముడు

అంబాజీపేట: వ్యవసాయ రంగంలో రైతులందరికీ ఆరాధ్య దైవం బలరాముడేనని సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు అన్నారు. గంగలకుర్రు అగ్రహారంలో కోదండ రామాలయం వద్ద బలరామ్ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. అడపా చినబాబు దంపతులు హలపూజ, గోపూజ, బలరామ పూజలు నిర్వహించారు. ఉపసర్పంచ్ బందన రాంబాబు, ఉప్పుగంటి భాస్కరరావు పాల్గొన్నారు.

మహిళలను మోసం చేస్తున్న చంద్రబాబు



పెదపట్నంలో కూటమి మోసాలను ప్రజలకు వివరిస్తున్న శ్రీనివాసరావు

మామిడికుదురు: స్త్రీ శక్తి పథకం పేరిట మహిళలను సీఎం చంద్రబాబు మోసం చేస్తున్నారని వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజకవర్గ కో-ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి విమర్శించారు. బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ కార్యక్రమం ఆదివారం పెదపట్నంలో పార్టీ పరిశీలకుడు నీతిపూడి గణేష్‌బాబు ఆధ్వర్యంలో జరిగింది. గ్రామ శాఖ అధ్యక్షుడు గోగి రామ్మూర్తి పర్యవేక్షణలో మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రామచంద్రరావు నేతృత్వంలో రచ్చబండ జరిగింది. కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించారు. ఇంటింటికి వెళ్లి క్యూఆర్ కోడ్ స్కాన్ చేయించి ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ఒక్కొక్కరూ ఎంత మేర నష్టపోయారో ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు నెల్లి దుర్గాప్రసాద్, బళ్ల కీర్తి రైనా, కొమ్ముల చిన్న, కొమ్ముల బుజ్జి, యేడిద రాజ్‌కుమార్, బత్తుల అశోక్, పితాని శ్రీను, యేడిద లక్ష్మణ్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభ్యున్నతికి కృషి చేద్దాం



హరీష్‌ను అభినందిస్తున్న జగ్గిరెడ్డి



జగ్గిరెడ్డిని సత్కరిస్తున్న ఆలమూరు మండల నాయకులు

ఆలమూరు: వైఎస్సార్‌సీపీ అభ్యున్నతికి కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేసి రాబోయే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంను చేద్దామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఇటీవల పార్టీ రాష్ట్ర మేధావి ఫోరం కార్యదర్శిగా నియమితులైన పెనికేరుకు చెందిన కొడమంచిలి హరీష్ ఆదివారం జగ్గిరెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. హరీష్‌కు పార్టీ కండువా కప్పి అభినందించారు. ప్రజా సమస్యల పట్ల, ప్రభుత్వ వైఫల్యాల పట్ల అనునిత్యం పోరాడాలన్నారు. అనంతరం జగ్గిరెడ్డిని మండల పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాస్, నాగ మోహన్‌రెడ్డి, ధనుంజయ్, గుత్తుల శ్రీనివాస్, జయరాజు, జి.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

సందడిగా నిమజ్జనాలు



పి.గన్నవరంలో గణపతి విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న చిన్నారులు

పి.గన్నవరం: గణేష్ నిమజ్జన కార్యక్రమాలు మండలంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎల్.గన్నవరం శివారు వేమనవారి పాలెంలో భద్రాద్రి చతుర్భుజ సీతారామ స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించి పవిత్ర వైనతేయి నదిలో నిమజ్జనం చేశారు. మధ్యాహ్నం భక్తులకు పెద్ద ఎత్తున అన్న సమారాధన చేశారు. అలాగే పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాలను భక్తులు మేళ తాళాలతో ఊరేగించి నదీపాయలు, పంట కాలువల్లో నిమజ్జనం చేశారు.

అధ్వానంగా పారిశుధ్యం



కె.పెదపూడిలో నివాసాల మధ్య పేరుకుపోయిన చెత్తాచెదారం

అంబాజీపేట: మండలంలోని ప్రజలంతా ఒక పక్క జ్వరాలతో అల్లాడిపోతుంటే.. మరో పక్క పారిశుధ్యం అధ్వానంగా ఉంది. గ్రామంలో ఎక్కడచూసిన పారిశుధ్యం అంతంత మాత్రంగానే దర్శనమిస్తుంది. వర్షాలు పడటంతో వ్యాధులు మరింత ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. దగ్గు, జలుబు, జ్వరం, టైఫాయిడ్ వంటి నొప్పులతో బాధపడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. ఆసుపత్రులకు వచ్చే రోజువారీ రోగుల్లో 60 శాతం మంది జ్వరంతో బాధపడేవారు ఉంటున్నారు. ఓ వైపు వ్యాధులు విజృంభిస్తున్న తరుణంలో పారిశుధ్యం క్షీణిస్తే మరిన్ని సమస్యలు తలెత్తే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు గ్రామాల్లో పారిశుధ్య పనులు వేగవంతం చేసి బ్లీచింగ్, ఏబిట్ మందులను స్ప్రే చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.